ISBN 81-237-1738-5
ప్రథమ ముద్రణ 1996 *(శక 1918)*

Haddi Tutane Par ... *(Telugu)*
రూ. 9.00
డైరెక్టర్, నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా, ఎ-5, గ్రీన్‌పార్క్, న్యూఢిల్లీ-110016 ద్వారా ప్రచురింపబడినది.

నవ శిక్షిత సాహిత్యమాల

ఎముకలు విరిగినప్పుడు...

జితేంద్ర మాహేశ్వరీ

చిత్రాలు
సుబ్బా ఘోష్
అనువాదం
కె. ఎస్. వసంత లక్ష్మి



नेशनल बुक ट्रस्ट, इंडिया



వైద్యుడు రాము చేతికి చికిత్స చేస్తున్నాడు.

ఎముకలు విరిగినప్పుడు...

పల్లెలో ఒకరోజున రాము మామిడి చెట్టు ఎక్కి కింద పడ్డాడు. పడు తూనే గట్టిగా ఏడవటం మొదలు పెట్టాడు. చుట్టు పక్కల పొలాల్లో మనుషులు పని చేసుకుంటున్నారు. రాము ఏడుపు, కేకలూ విని వారు రాము సహాయానికి వచ్చారు. వస్తూనే రాము ఒక చెయ్యి వంకరగా ఉండటాన్ని వాళ్లు గమనించారు. రాము తన చేతిని ఎత్త లేక పోతున్నాడు. కొంచెం సేపటికే రాము చెయ్యి బాగా వాచిపో యింది. చెయ్యి ముట్టు కుంటే చాలు బాధతో అరుస్తున్నాడు.

ఇద్దరు పల్లెవాసులు కలిసి రామూను ఎత్తి బండిలో కూర్చోపె ట్టారు. ఎత్తుతూంటే రామూకు భరించరాని నొప్పి కలిగింది. గ్రామవా సులు రామూను వస్తాదు (గ్రామ వైద్యుడు) దగ్గరికి తీసుకు వెళ్లారు. వస్తాదు రాము చేతిని చూశాడు. రాము చేయి విరిగి పోయిందని నిర్ధారించాడు. అతడు రాము చేతిని ఒక్కలాగు గట్టిగా లాగి తిన్నగా చేశాడు. పైన ఏదో మందు రాసి చేతికి కట్టుకట్టాడు. చేతిని లాగి తిన్నగా చేస్తున్నప్పుడు నొప్పి తాళలేక రాము బాధతో అరిచాడు. చెప్పలేనంత నొప్పి కలిగింది.

గ్రామవాసులు రామూను ఇంటికి తీసుకొచ్చారు. సాయంత్రానికల్లా

అతడి చేతి వాపు రెట్టింపయ్యింది. నొప్పివల్ల రామూపరిస్థితి ఏమీ బాగులేదు. రాత్రంతా ఒక్క క్షణం కంటి మీద కునుకు లేదు. భోజనం, త్రాగటం, మల మూత్రాదులన్నీ పక్కలోనే చేయాల్సి వచ్చింది. మెల్ల మెల్లగా, ఎలాగయితేనేం, నొప్పి, వాపూ కాస్త, కాస్తగా తగ్గు ముఖంప ట్టాయి. సుమారు నెలరోజుల తరువాత కట్లు విప్పేశారు.

కానీ జరిగిందేమిటి? అతడి చెయ్యి ఇంకా వంకరగానే ఉండిపో యింది. కట్టెపుల్లలాగా గట్టిబడి వంగటమే లేదు. వస్తాదు కొన్నాళ్లు మాలీషు చేశాడు. కానీ దానివల్లా ఏమీ ప్రయోజనం కనపడలేదు. రామూ చాలా ఉదాసీనంగా అయ్యేడు. ఆ చేత్తో ఏపనీ చేయలేక పోతున్నాడు.

రామూతండ్రి హరి, ఆలోచించి, రామూను ఒకసారి ప్రభుత్వ ఆస్ప త్రిలో చూపించాలని నిర్ణయించాడు. ఆమరునాడే రామూని ఆస్ప త్రికి తీసుకెళ్లాడు. ఎముకల డాక్టరు రామూ చేతిని క్షుణంగా పరీక్షిం చాడు. ఆయన రామూ చేతికి ఎక్స్‌రే ఫోటో తీశారు. రామూ మోచేతి ఎముక వంకరగా అతుక్కుందని చెప్పారు. బాగవటం కష్టమని కూడా వివరించారు. ఇదివిని హరి చాలా బాధపడ్డాడు.

హరి డాక్టరును అడిగాడు, “ డాక్టరుగారూ, రామూ మోచేతి ఎముక వంకరగా ఎందుకు అతుక్కుందండీ?”

డాక్టరు ఇలా జవాబిచ్చారు, “ఎముక విరిగి నప్పుడు అది తన సరైన స్థానం నుండి కదిలి పోతుంది. దానిని సరిగా సవరించటం అతి ఆవశ్యకం. అలా చేయకపోతే, ఎముక ఏ విధంగా పోయిందో, ఆ జరిగిన చోటు నుంచే అతుక్కుపోతుంది. ఒకసారి అతుక్కుపోతే, ఇక మరి అంతే, ఇక దాన్ని తిన్నగా చేయడం అసాధ్యం కొన్నికొన్ని

సార్లు ఆపరేషన్ ద్వారా దాన్ని సరి చేయ వచ్చు." హరి అడిగాడు, "కానీ డాక్టరుగారూ, వీడిచెయ్యి ఇలా వంకరై పోయిందేమండీ?"


డాక్టరు గారు ఇలా జవాబిచ్చారు, "ఎముక అతుక్కోవటానికి, దాన్ని కదలకుండా జాగ్రత్త వహించాలి. అందుకోసం ప్రక్క నుండే కీళ్లను కూడా కట్టి ఉంచాలి. అలా చేయకపోతే అతుక్కున్నప్పుడీ విధంగా వంకరగా అయిపోతాయి. కానీ ఈ వంకర కొంత సహజమే, ఆ తరువాత క్రమేణ అది తగ్గుతూ వస్తుంది."

హరి రామూను ఇంటికి తీసుకు వెళ్లాడు. రాత్రి అంతా సరిగ్గా నిద్ర పోలేక పోయాడు. అతడిమనసులో ఏవేవో ప్రశ్నలు. రామూ చేయి వంకర కా కుండా కాపాడటమెలా? ఎముకలు విరిగి నప్పుడు సరైన చికిత్స ఏ విధంగా చేయించాలి? ఇలా ఎన్నో. అతడు చివరికి దీన్ని గురించి పూర్తి వివరాలన్నీ డాక్టరు వద్ద తెలుసుకుని సలహా పొందాలి, అని నిర్ణయించాడు.

మరునాడు హరి తిరిగి ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ చాలామంది వారి ఎముకలకు చికిత్స పొందటం గమనించాడు. కొంతమంది చేతులు ప్లాస్టర్ లో ఉంటే, కొంతమంది కాళ్లు ప్లాస్టర్ లో ఉన్నాయి.

హరి డాక్టరుగారిని అడిగాడు. "డాక్టరుగారూ, రామూ చెయ్యికూడా ఈ విధమైన చికిత్సతో బాగయి ఉండేదా?"


డాక్టరు అన్నారు, "సరైన చికిత్సతో చాలా మట్టుకు, ఎముకలు అతుక్కుంటాయి, ఎముకల సరైన పరిస్థితి ఎక్సరే ద్వారా తెలుసుకోవచ్చు. ఎముకలు అతుక్కున్న తరువాత కొన్నాళ్లపాటు జాగ్రత్తగా ఉండాలి. దీనివల్ల ఎముక తిరిగి మామూలు స్థితికి రాగలుగుతుంది."



శరీరంలో ఉండే ఎముకల అస్థిపంజరం


(అ) మోకాలి కీలు

(ఆ) మోచేతి కీలు



హరి మళ్లీ అడిగాడు, "మా పల్లెలో అడపాదడపా ఎవరికో ఒకరికి ఎముకలు విరుగుతూనే ఉంటాయి. అసలీ ఎముకలు అంటే ఏమిటండీ?"

డాక్టరు గారీ విధంగా జవాబిచ్చారు. "మనశరీరం ఎన్నో చిన్నవీ, పెద్దవీ ఆయిన ఎముకలతో తయారైంది. ఈ ఎముకల గూడునే అస్థి పంజరం అంటారు. ఎముకలలో చాలా భాగం కండరాలతో కప్పబడి




(అ) కండరాలు లేనప్పుడు భుజం.
(ఆ) కండరాల సహాయంతో మోచేతిని వంచటం.

ఉంటుంది. ఈ కండరాలే, ఒక ఎముకను మరొక ఎముకతో జోడించి ఉంచుతాయి. వీటి సహాయంతోనే మనం మన కాళ్లనూ, చేతులనూ రకరకాలుగా వంచగలుగుతాం."


"రెండు ఎముకలు కలిసిన చోట ఒక కీలు ఏర్పడుతుంది. ఉదాహరణకు, మోచేయి, మోకాలూ వగైరా. కీళ్ల దగ్గరి ఎముకలను తడిమితే వీటి ఉనికిని గ్రహించవచ్చు."

హరి తన మోచేతిని తడిమి ఎముకను చూసుకున్నాడు. అతడు



(అ) భుజంలోని రేకులాంటి ఎముక.

(ఆ) తొడవద్దుండే పొడవాటి ఎముక.




పుర్రెలోపల మెదడు.

కాలిపై బరువైన రాయి పడటం వల్ల ఎముక విరిగి పోయింది.



(అ) మామూలుగా ఉన్న ఎముక.

(ఆ) రోగ గ్రస్తమైన ఎముక.



తన శరీరం లోని అన్య కీళ్లను తడిమి ఎముకలను చూసుకున్నాడు.

అతను అడిగాడు. "డాక్టరుగారూ, మా పల్లెలో తవ్వకం పనులు జరుగుతున్నప్పుడు అప్పుడప్పుడు జంతువుల ఎముకలు కనబడుతూ ఉంటాయి. మన ఎముకలు కూడా అలాగే ఉంటాయా?"

డాక్టరు తమ అల్మారాలో నుంచి ఒక ఎముకను బైటికి తీశారు. చూడటానికి అదొక కట్టెపుల్లలా ఉంది. అపుడిలా అన్నారు, "మన ఎముకలూ, జంతువుల ఎముకలూ సుమారుగా ఒకే విధంగా ఉంటాయి. కానీ శరీరం లోపలున్నపుడు ఇవి యిలా ప్రాణంలేని కట్టెపుల్లలా ఉండవు. వీటి గుండా కూడా రక్తం ప్రవహిస్తూంటుంది. శరీరంలోని వివిధ భాగాల్లో ఎముకలు చూడటానికి వేర్వేరు విధాలుగా ఉంటాయి. కొన్ని ఎముకలు చప్టాగా ఉంటాయి. స్త్రీ, పురుషులలో కొన్ని ఎముకల నిర్మాణం వేర్వేరు విధంగా ఉంటుంది. కొన్ని ఎముకలు శరీరంలోని నాజూకైన అంగాలను కవచంలా కాపాడటానికి, అంటే మెదడు కోసం పుర్రె, గుండె, ఊపిరి తిత్తులకోసమై ప్రక్కటెముకల పంజరం. ఎముకల్లోని దారుఢ్యం, వీటిలో సమకూడిన కొన్ని తత్వాల వల్ల వస్తుంది. దీనినే కాల్షియం అంటాంమనం."

హరి అడిగాడు, "ఎముకలు ఎలా విరుగుతాయి?"

డాక్టరు వివరించారు, "మామూలుగా ఎముకలు ఏదైనా గాయం తగిలితేనే విరుగుతాయి. క్రింద పడినప్పుడు శరీరం యొక్క పూర్తి బరువు ఏదైనా ఒకే ఒక ఎముకపై పడితే, అది విరుగుతుంది. ఎన్నో సార్లు, ఎముకలు దెబ్బతగలక పోయినా బీటలు వారతాయి."

సరీగా అదేసమయానికి ఒకామె తన చేతుల్లో కొన్ని రోజుల వయసు మాత్రమే ఉన్న ఒక బిడ్డను తీసుకుని వచ్చింది. అది చూసి హరి

ఎముక విరిగినప్పుడు చేయి వాచిపోతుంది.





ఎముక విరిగినప్పుడు చెయ్యి వ్రేలాడుతుంది.

అడిగాడు, "అరే, ఇంత చిన్న బిడ్డకు కూడా ఎముక విరిగిందా?"

డాక్టరు గారిలా జవాబిచ్చారు, "అవును ఈ బిడ్డకు పురిటి సమయంలో ఎముక విరిగింది. ఇలా జరగటానికి కారణం, అజ్ఞానులైన మంత్రసానులు, దాయీలు. పురిటి లో బిడ్డను అస్తవ్యస్తంగా లాగటం వంటి చర్యలు చేయటం."

"ఎముకలు పుట్టిన దగ్గరినుండి, మరణించేలోగా ఎప్పుడైనా విరగవచ్చు. పిల్లల ఎముకలు కొంచెం సులభంగా విరుగుతాయి. ఎందుకంటే అవి చాలా లేతగా ఉంటాయి."

హరి తిరిగి అన్నాడు, "డాక్టరు గారూ, మా పల్లెలో ఓసారి ఒక ముసలి అతని ఎముక విరిగింది. కొద్దిరోజుల తరువాత అతను చనిపోయాడు. ఎముక విరగటానికీ, అతని చావుకూ సంబంధ మేమిటి?"

అప్పుడు డాక్టరు గారిలా అన్నారు, "ముసలితనంలో ఎముకలు విరిగి నప్పుడు, ఆమనిషి కొన్ని నెలల పాటు మంచానపడి విశ్రాంతి తీసుకోవలసి వస్తుంది. దీనివల్ల శరీరంలోని ఇతర భాగాలు పాడయి పోతాయి. ఛాతీలో కఫం పేరుకుంటుంది. మూత్రపిండాలలో వాపురావచ్చు. ఈ పరిస్థితుల్లో మరణంకూడా సంభవించవచ్చు. సరైన చికిత్స ద్వారా ఇటువంటి బాధలు కలగ కుండా చూసుకోవచ్చు."

హరి అన్నాడు, "కానీ డాక్టరుగారూ, దెబ్బతగలడమనేది ఒక అతి సాధారణ విషయం. ఎముక విరిగిందో లేదో తెల్సుకో వటం ఎలా?"

డాక్టరుగారిలా అన్నారు, "ఎముక విరిగి నప్పుడు, ఆ చుట్టూరా రక్తం వచ్చి చేరుతుంది. దీనివల్ల విరిగిన భాగంలో వాపు వస్తుంది. చేయి వంకర తిరుగుతుంది. కొన్ని సార్లు ఎముక విరిగిన శబ్దం కూడా వినవస్తుంది. ఎముక విరిగి నప్పుడు చాలా నొప్పి కలుగుతుంది.



ఎముక విరిగి చర్మాన్ని చీల్చుకుని బయటికి పొడుచుకు వచ్చింది.


ముట్టు కుంటే, విరిగిన ఎముకలు ఒకదానినొకటి రాసుకుంటాయి. దీని వల్ల శబ్దం వస్తుంది, ఆపైన విపరీతమైన నొప్పి కలుగుతుంది. చాలా సార్లు ఎముక విరిగిన భాగం వ్రేలాడు తుంది. ఆ భాగంతో ఏ పనినీ చేయలేరు. కొన్నిసార్లు ఎముకలో బీటమాత్రమే పడుతుంది. అటువం టప్పుడు నొప్పి తప్ప మరేమీ కనబడదు. పిల్లలలో సాధారణంగా ఎముకలు ఈ రకంగానే విరుగుతాయి. ఇది కనిపెట్టడానికి ఎక్స్‌రే తీయటం అవసరం."

"ఒక్కొక్కసారి, విరిగిన ఎముక బైటికి పొడుచుకు వచ్చేస్తుంది. అటు వంటప్పుడు చాలా రక్తస్రావం జరుగుతుంది. చుట్టుపక్కలగల దుమ్మూ, ధూళీ గాయాన్ని మలినం చేస్తాయి. దీనివల్ల గాయానికి చీముపట్టవచ్చు. ఈ చీము లోపలి ఎముక వరకూ కూడా విస్తరించే ప్రమాదముంది. ఇలా జరిగితే, ఇదొక పెద్ద సమస్యగా మారుతుంది. ఎన్నోసార్లు ఇలా విస్తరించిన చీము, మానటానికి ఎన్నో ఏళ్లు కూడా పడుతుంది."

హరి అడిగాడు. "డాక్టరుగారూ, మా ఇళ్లు ఆస్పత్రి నుండి ఇరవై మైళ్లదూరంలో ఉన్నాయి. ఇక్కడికి రోగని తీసుకొచ్చే సమయంలో ఎంతో కుదుపూ అదీ ఉంటుంది. దీనివల్ల విపరీతమైన నొప్పి కలుగు తుంది. దీనికి మరేం చేయాలండీ?"


డాక్టరు గారీవిధంగా జవాబిచ్చారు. " మొట్టమొదట, విరిగిన ఎము కకు, కదల కుండా ఉండేందుకై, ఒక ఆధారమేర్పరచాలి. ఇక రోగికి కొంత ఉపశమనం కలుగుతుంది. ఎముకకు ఆధారంగా, ఏదైనా గట్టి వస్తువును ఉపయోగించ వచ్చు. ఇంట్లోనే, దొరికే కర్ర లేక చెక్క బద్దీలు, పట్టీలు లాంటివి దీనికై ఉపయోగించ వచ్చు. ఇటువంటి రక రకాల వస్తువులను, ఎముకకు ఆలంబనంగా వాడవచ్చు. శరీరం లోని మరే భాగం తోనైనా, విరిగిన ఎముకను కలిపి కట్టినందు వల్ల కూడా

విరిగిన ఎముకకు సహాయంగా వాడగలిగిన వస్తువులు




ఈ రకమైన ఆలంబన లభిస్తుంది." ఇటురా, నీకు శరీరం లోని వివిధ అంగాలకు ఇలా ఆలంబన నిచ్చే పద్ధతి చూపిస్తాను:

"భుజం దగ్గరి ఎముక విరిగినప్పుడు త్రికోణాకారం గల పట్టీని వాడవచ్చు.




త్రికోణాకారపు బట్టతో పట్టీ కట్టే విధానం.

“చేతి ఎముక విరిగినప్పుడు, విరిగిన చేతిని ఛాతీతో కలిపి కట్టాలి.



విరిగిన ఎముకను ఛాతికేసి అదిమికూడా కట్టవచ్చును.




"తొడ ఎముక విరిగినప్పుడు, విరిగిన తొడను రెండవకాలి తొడతో కలిపి కట్టాలి."

"మోకాలు లేదా అంతకన్న కింది భాగాలకు కర్రబద్దలు లేక గట్టి పీటలు వగైరా వాడవచ్చు."

"ఇలా ఆలంబనకై కడుతున్నప్పుడు మరీ గట్టిగా కట్ట కుండా జాగ్రత్త వహించాలి. ఎక్కవ గట్టిగా కట్టేస్తే, ఆభాగానికి రక్తప్రసరణ ఆగిపో తుంది. అలాంటప్పుడు ఆ భాగం రక్తం లేమి వల్ల చచ్చుపడవచ్చు."


“ఒకవేళ ఎముక పైన గాయం తగిలితే, దానికి కూడా సరైన సంరక్షణ అవసరం. మొదట దెబ్బతగిలిన చోటును మంచి నీటితో శుభ్రపరచాలి. ఆ తరువాత ఒక శుభ్రంగా ఉతికిన రుమాలుగాని లేక మరేదైన శభ్రంగా ఉతికిన బట్టతోగానీ, ఆ గాయాన్ని కప్పి ఉంచాలి. ఇక విరిగిన ఎముకకు ఆలంబనం కల్పించే కర్ర లేదా చెక్క బల్లతో

గాయానికి సంరక్షణ.



కలిపి కట్టాలి. ఒకవేళ గాయం నుండి రక్తస్రావం అధికంగా ఉంటే కట్టును కొంచెం గట్టిగా కట్టాలి. దీనితో రక్తం కారడం కొంత తగ్గుతుంది. రక్తం కారటాన్ని ఆపటానికై దానిపైన మట్టి చల్లకూడదు."

"కొన్ని సార్లు విరిగిన ఎముక గాయంలోంచి పైకి పొడుచుకువచ్చి




(అ) చర్మం లోంచి విరిగిన ఎముక ముక్క బైట పడింది.

(ఆ) ఆపరేషన్ ద్వారా విరిగిన ఎముక ముక్క అతికించబడింది.

ముక్కలా విరగవచ్చు. విరిగి బైటపడిన ఈ ఎముక ముక్కను నీటితో శుభ్రంగా కడిగి, ఒక శుభ్రమైన బట్టలో ఉంచి, రోగితోబాటు ఆస్పత్రికి తీసుకు వెళ్లాలి. సాధారణంగా ఇలా విరిగి ముక్కైపోయిన ఎము


విరిగి తెగి పడిన చేతి ముక్క సంరక్షణ.



అ

(అ) తెగి పోయిన చేతి ముక్కను శుభ్రమైన నీటిలో కడగాలి.


(ఆ) దాన్ని ఒక పరి శుభ్రమైన బట్టలో ఉంచాలి.



ఆ




ఇ



ఈ

(ఇ) దీన్ని ఒక ప్లాస్టిక్ సంచిలో భద్రపరచాలి.

(ఈ) ఒక పెద్ద సంచిలో ఐసుముక్కలు వేయాలి. దానిలో చేతిని ఉంచాలి.



రక్తనాళం తెగినప్పుడు చేయినల్లగా మారుతుంది.

కను తిరిగి దాని స్థానంలో అతికించే వీలుంటుంది."

కొన్ని కొన్ని సార్లు శరీరంలోంచి ఏవైనా భాగాలు దెబ్బ తగిలి తెగి పోవచ్చు. ఈ విధంగా తెగిపోయి వేరైన భాగాలను తిరిగి జోడించ వచ్చు. తెగి, వేరైన అంగాన్ని ఆస్పత్రికి చేర్చే సమయంలో చాలా జాగ్రత్త వహించాలి.


"మొదట తెగిపోయిన అంగాన్ని శుభ్రమైన నీటితో కడగాలి. దీనిని ఒక శుభ్రంగా ఉతికిన బట్టలో చుట్టాలి. ఆ తరువాత దీనిని ఒక ప్లాస్టిక్ సంచిలో వేసి, సంచి మూతిని గట్టిగా మూసివేయాలి. మరొక పెద్ద ప్లాస్టిక్ సంచిలో సగంవరకు ఐసుముక్కలు వేసి, లేదా ఐసు లేకపోతే చల్లని నీరు కూడా వాడ వచ్చు, తెగిన భాగం ఉంచిన చిన్న సంచిని అందులో వేయాలి. ఇలా చేసినందువల్ల తెగిన భాగం త్వరగా పాడు కాదు. ఆపరేషన్ ద్వారా దాన్ని తిరిగి అతికించ వచ్చును. ఈ ఆపరే షన్ కొన్ని పెద్ద ఆసుపత్రుల్లో మాత్రమే చేయ వీలౌతుంది."

హరి అడిగాడు. "ఎముకలు విరిగి నపుడు ఆస్పత్రిలో చికిత్స ఎలా చేస్తారండీ?"

డాక్టరుగారిలా అన్నారు. "మొదట రోగిని పరీక్షించి, ఏ ఎముక విరిగిందో నిర్ధారిస్తారు. విరిగిన భాగంలోని రక్తనాళాలూ, నరాలూ పరీక్షిస్తారు. కొన్ని సార్లు విరిగిన ఎముక ఆ భాగంలోని రక్తనాళాలనూ, నరాలనూ నొక్కివేస్తుంది. మరికొన్నిసార్లు వాటిని కత్తిరించి వేస్తుంది లేదా తెంపేస్తుంది. అలా జరిగి నప్పుడు ఆ భాగంలో తిమ్మిరి ఎక్కినట్లుంటుంది. లేదా నీలంగా మారిపోతుంది. ఇది చాలా గడ్డు సమస్య. ఒకవేళ వెంటనే ఆపరేషన్ ద్వారా ఈ ఒత్తిడిని తొలగించక పోయినట్లయితే, ఆ భాగం ఎప్పటికీ చచ్చుపడిపోతుంది. కొన్ని కొన్ని సార్లు, ఇలా చచ్చు పడిపోయిన భాగాన్ని తీసివేయవలసి వస్తుంది."


"ఈ విధమైన ఒత్తిడిని, ఇంట్లోనే రోగి ఉన్నప్పుడు కూడా తొలగించ వీలుందా?" హరి అడిగాడు.

మరల డాక్టరుగారిలా అన్నారు. "కొన్ని సార్లు విరిగిన ఎముకను తిన్నగా పెట్టి కట్టినందువల్ల ఈ రకపు ఒత్తిడిని తగ్గించవచ్చును. ఒత్తిడి తగ్గినట్లని పించక పోతే వెంటనే, దగ్గరిలోని పెద్దాసుపత్రికి రోగిని తరలించాలి. రక్తనాళాలు, నరాలూ సరిగ్గా ఉన్నట్టయితే,



ఎముకను సరిచేసి, ఎముకకు ఏదైనా ఒత్తు పెట్టి కట్టుకడతారు. ఎక్స్-రే తో ఎముక యొక్క ఫోటోను తీస్తారు."

హరి ఇలా అడిగాడు. "బైట కూర్చున్న చాలామందికి ప్లాస్టర్ వేసి


ఆపరేషన్

ఉంది. ఎముకలు విరిగి నప్పుడు ప్లాస్టరు వేయటమే సరైన చికిత్సా?"

"లేదు. అదొక్కటేకాదు. చాలా మంది రోగులకు ప్లాస్టరే అవసర మౌతుంది. కొన్ని ఎముకలు ఉత్త కట్టు కట్టినా అతుక్కుంటాయి. కొన్ని ఎముకలు సరి చేయటానికి వాటిని లాగిఉంచవలసి వస్తుంది. దీని కోసం రోగిని కొన్ని వారాలపాటు ఆస్పత్రిలో ఉంచవలసి వస్తుంది. కొన్ని ఎముకలు ఆపరేషన్ లేకుండా అతుక్కోవు. వీటిని ఆపరేషన్ చేసి అతికించాల్సి వస్తుంది." అన్నారు డాక్టరు.

"డాక్టరుగారూ! ప్లాస్టర్ అంటే ఏమిటి? దీనితో ఎముకలు ఏ విధంగా


అతుక్కుంటాయి?" అని హరి అడిగాడు.


దానికి డాక్టరు ఈ విధంగా జవాబిచ్చారు. "ప్లాస్టర్ లో ఉండేది సున్నం. ఈ సున్నంతోనే బొమ్మలు కూడా చేస్తుంటారు. నీటిలో తడిపిన సున్నం, ఏ ఆకారం లోకి కావలిస్తే ఆ ఆకారంలోకి మలుచుకోవచ్చు. ఆ సున్నం అదే ఆకారంలోకి ఎండి గట్టిపడుతుంది. ఆస్పత్రిలో సున్నం పొడిని పట్టీలలో నింపుతారు. ఎవరికైనా ప్లాస్టర్ వేయవలసొచ్చి నప్పుడు ఎముకను కొద్దిగాలాగి సరైన స్థానంలోనికి తెప్పించటం అవసరం. సున్నం పూసిన పట్టీలను నీటిలో తడుపుతారు. ఒక్కొక్కొపొరను విరిగిన భాగంపై చుడతారు. ఈ సున్నం సుమారు 4-5 నిమిషాలలో ఆరిపోతుంది. ఆరే లోగా దానికి ఆ శరీరం భాగపు ఆకారం వస్తుంది. దీనివల్ల విరిగిన ఎముకను కదల కుండా స్థిరంగా ఉంచుతుంది. ఎముక సహజంగానే పెరిగి అతుక్కు పోతుంది. ప్లాస్టర్ విరిగి అతుక్కుంటున్న ఎముకను కేవలం కదల కుండా మాత్రమే ఉంచుతుంది, ఎముకను అతికించేపని ప్లాస్టర్‌ది కానేకాదు. విరిగిన ఎముక చుట్టు పక్కల మొదట పెరిగే ఎముక పచ్చిగా ఉంటుంది. క్రమేపీ అది దృఢంగా తయారవుతుంది. వేర్వేరు ఎముకలకు అతుక్కునేందుకు పట్టే సమయంలో కూడా తేడాలుంటాయి. పిల్లల ఎవకలు త్వరగా అతుక్కుంటాయి. పిల్లలకు చేతి ఎముకలు మూడు లేక నాలుగు వారాలలో అతుక్కుంటాయి. కాలి ఎముకలకు ఆరు వారాల వరకూ పట్టచ్చు. పెద్దల ఎముకలు అతుక్కోవటానికి దీనికి రెట్టింపుసమయం పడుతుంది. ఎముక అతుక్కోగానే ప్లాస్టర్ తీసివేస్తారు."

"అరే! ఇది చాలా సులభమైన పద్ధతే! ఇంలాంటి ప్లాస్టర్ను మేం ఇంట్లోకూడా వేసుకోవచ్చు." హరి సంబరపడుతూ అన్నాడు.

డాక్టరుగారు నవ్వుతూ అన్నారు. "అబ్బే అలాకాదు. ఇది వినటానికి సులువని పించినా, అంత సులభం చేసేటప్పుడు మాత్రంకాదు. ప్లాస్టర్ వేసేందుకు మంచి అనుభవం కావాలి. అనుభవం లేని వారి చేతవే యించుకుంటే, ప్లాస్టర్ వదులవ్వచ్చు. అలాజరిగితే ఎముక తనస్థానం నుండి కదిలి పోతుంది."


"ప్లాస్టర్ బిగుతైపోతే, చర్మాన్ని రాపిడి వల్ల గాయాలు అవ్వచ్చు. ఒక వేళ ప్లాస్టర్ మరీ బిగుతైపోతే, ఆ భాగానికి రక్తప్రసరణ ఆగి పోవచ్చు. ఇదొక కఠిన సమస్యగా కూడా మారవచ్చు. అటువంటి





విరిగిన భాగాన్ని ఎత్తుగా ఉంచే విధానం.





పరిస్థితుల్లో రోగియొక్క, కాలుగానీ చేయిగానీ తీసి వేయ వలసి రావచ్చు."

అప్పుడు హరికి తమ గ్రామంలో ఒక అబ్బాయికి ఎముక విర గటం, ఆ తరువాత అతడి చేయి తీసివేయటం గుర్తొచ్చింది. ఒక వేళ ప్లాస్టర్ సరిగా వేయలేదేమో అనుకున్నాడు. అతనిలా ఆలోచి స్తూండగా గదిలోకి ఒకరోగి వచ్చాడు. అతడికి ఇప్పుడిప్పుడే ప్లాస్టర్ వేసినట్టుంది.

ఆ రోగితో డాక్టర్ గారిలా అన్నారు. "ప్లాస్టర్ వేసిన రెండు మూడు రోజుల దాకా జాగ్రత్త వహించటం చాలా అవసరం. ప్లాస్టర్ బాగా ఆరేవరకూ చేత్తోగానీ, అర చేత్తోకానీ ఏ పనులూ చేయవద్దు, కదప వద్దు, ఇలా కదపకుండా ఉంచకపోతే ప్లాస్టర్ విరిగిపోతుంది. దీనివల్ల మీకు నొప్పి, బాధకలగటమేగాక, ఎముక సరైన పద్ధతిలో అతుక్కోక పోవచ్చు. ఆ ప్లాస్టర్ తడవకుండా చూసుకోవాలి. స్నానం చేసేసమ యంలో ప్లాస్టర్ వేసిన భాగాన్ని ప్లాస్టక్ కవర్ లేదా పాలీథీన్ బాగ్ తో కప్పాలి. మలమూత్రాదులు విసర్జించే సమయంలో కూడా ప్లాస్టర్ మలినం కాకుండా చూసుకోవాలి. శరీరం లో ఏ ఎముక విరిగితే అక్కడ వాపువస్తుంది. ఆ భాగాన్ని ఎత్తులో ఉంచాలి. దీనివల్ల వాపు తగ్గుతుంది. శరీరంలోని విభిన్న భాగాలను ఎత్తులో ఉంచేవిధానం ఈ చిత్రాల్లో చూడచ్చును."

"ప్లాస్టర్ ఆరిన తరువాత, ప్లాస్టర్ లో ఉన్న కాళ్లూ లేక చేతివేళ్లు కదపగలగాలి. ఇలా చేసినందు వల్ల కూడా వాపు తగ్గుతుంది."

రోగి ఇలా అన్నాడు. "డాక్టరుగారూ, నా జబ్బలో చాలా నొప్పిగా ఉంది. దీనికేదైనా మందు ఇవ్వండి."

డాక్టరు గారు ఒక మందు రాసిచ్చి ఇలా అన్నారు. "సాధారణంగా ప్లాస్టర్ వేయగానే, చాలామేరకు నొప్పి అదే తగ్గిపోతుంది. అలా కాక పోతే నాకు వెంటనే చూపించండి. ఇంక వేరే లక్షణాలు ఏవైనా కన పడినా వెంటనే నాదగ్గరకు రండి. ఈ లక్షణాలు ఏమి టంటే-మొద టిది, వేళ్లు వాయడం లేదా పొడుగు అవటం. రెండవది వేళ్లు కదప లేక పోవటం. మూడవది వేళ్లలో ఏమీ స్పర్శలేక, తిమ్మిరెక్కడం. గోళ్లు నీలిరంగుకు మారినా తక్షణం ఆస్పత్రికి తీసుకు రావాలి. ఇటు వంటప్పుడు ప్లాస్టర్‌ను కత్తిరించ వల్సొస్తుంది. ఒకవేళ ఆస్పత్రి దూరంగా ఉంటే ప్లాస్టర్‌ను ఇంటిదగ్గరే కత్తిరించి తీసివేయచ్చు. ఇంట్లో ఈ విధంగా ప్లాస్టర్‌ను కత్తిరిస్తున్నప్పుడు, మొదటిగా ప్లాస్టర్‌ను తడిపి నానబెట్టాలి. అప్పుడది తడిసి మెత్తబడుతుంది. దీనిని చాకుగాని, బ్లేడుగానీ ఉపయోగించి కత్తిరించి, వెంటనే రోగిని ఆస్పత్రికి తరలించాలి."

అప్పుడొక రోగి ఇలా అడిగాడు. "డాక్టరుగారూ, ప్లాస్టర్ వేశాక, దానిక్రింద దురద పుట్టినపుడేం చేయాలి?"

"ఈ దురద కొద్ది సేపట్లోనే తగ్గిపోతుంది. ప్లాస్టర్ లోపలికి పెన్సిళ్లు, తీగెలూ, సూదులూ వంటివి గుచ్చకూడదు. అవి లోపలివైపు గుచ్చు కుని గాయం చేసే ప్రమాదం ఉంది. అలా అయిన గాయాలు, లోప ల్లోపలే భయంకర పరిణామాలకు దారితీయచ్చు. దురద దానంత టదే తగ్గకపోతే, డాక్టరు సలహా పొందడం మంచిది."

"ప్లాస్టర్ లోపల పౌడరు లాంటివి ఎప్పుడూ వేయకూడదు. పౌడరు లోపల కెళ్ళి కుళ్లిపోతుంది. అటువంటప్పుడు అనేక చర్మ రోగాలు కూడా రావచ్చు."

"ప్లాస్టర్‌లో మీ ఇష్టం వచ్చినప్పుడు, ఇష్టం వచ్చిన చోట్ని కత్తిరించకూడదు. ఇలా చేస్తే ఎముక దాన్ని స్థానం నుంచి జరిగిపోవచ్చు. కాలువిరిగి నప్పుడు ప్లాస్టర్ వేశాక కొన్ని సార్లు, కొంత కాలంపాటు నడవకుండా ఉండవలసి రావచ్చు. కానీ ఈ సూచన నుల్లంఘించి రోగి నడిస్తే, ఎముక జరిగి పోవచ్చు."

ఒకరోగి ప్లాస్టర్‌ను తీసివేయటం హరి గమనించాడు. అతని చేయి

ప్లాస్టర్ విప్పిన తరువాత చర్మంపై పొరలు కడతాయి.



నల్లగా కమిలి ఉంది. పైన చాలా పొరలు పొరలుగాకట్టింది. రోగి చాలా ఆందోళనతో భయపడుతూ కనిపించాడు.

డాక్టరుగారు ఆరోగికి ఇలా చెప్పారు "ప్లాస్టర్ తీసి వేశాక ఈ రకంగా కనపడటం మామూలే. ప్లాస్టర్ లో చర్మం పైన పొరలు కడతాయి. దురదకూడా ఉంటుంది. కానీ గోక కూడదు. వేడినీరు, సబ్బూతో ఆ భాగాన్ని కడగాలి తరువాత పూర్తిగా ఆర బెట్టాలి. దానిపైన ఏదైనా క్రీమ్ గానీ, నూనెగాని పూయాలి. ఈ విధంగా చేస్తే వారంరోజుల్లో ఈ చర్మం కూడా శరీరంలో మిగతా చర్మపురంగుకు వచ్చేస్తుంది."

"ప్లాస్టర్ విప్పాక కొద్దిపాటి వాపు కూడా వస్తుంది. ఈ రకం వాపు ఎక్కువగా కాళ్లల్లో వస్తూంటుంది. సాయంత్రాలకు ఎక్కువవటం, ఉదయానికి తగ్గటం జరుగుతుంది. ఇలా కొన్నాళ్ల పాటుంటుంది. ఇది సహజం. ఈ వాపు దానంతకదే తగ్గుతుంది."


రోగి అన్నాడు, "కానీ డాక్టరు గారూ, నాచేయి ఎండిన పుల్లలా తయారైందే? చెయ్యి కదపలేకుండా కూడా ఉన్నాను. ఈ చేత్తో పన్లు చేసుకో గలుగుతానా?"

"ప్లాస్టర్ లోపల ఉన్న కీళ్లు కొద్దిగా పట్టేస్తాయి. ఆ భాగంలోని కండరాలు కూడా బలహీనమౌతాయి. ఇందులో భయపడవలసిందేమీ లేదు. దీనికోసం డాక్టరు ఇచ్చిన సలహాలను తు.చ. తప్పకుండా పాటిస్తే కొద్ది రోజుల్లో పూర్తిగా చేయి స్వాధీనంలోకి వస్తుంది. కండరాలు కూడా ముందులా సరీగా తయారవుతాయి."

"కొంత మంది దీనికోసం మాలీషు, మర్దనాలూ చేయించు కుంటారు. కానీ ఇది ఎప్పుడూ చేయకూడదు. దీనివల్ల చాలా హాని కలుగుతుంది. కొన్నిసార్లు దీనివల్ల కీలు శాశ్వతంగా లొంగకుండాపోయే ప్రమా

దముంది." అన్నారు డాక్టరుగారు.

"మా గ్రామ పెద్ద కోసారి ఎముక విరిగితే, పట్నంలో ఆపరేషన్ చేశారండి. కాల్లో ఇనపకడ్డీ వేశారని చెప్పుకుంటూంటారండి. అలా ఎందుకు చేస్తారండి?" హరి అడిగాడు.



డాక్టరుగారిలా జవాబిచ్చారు, "చాలావరకూ విరిగిన ఎముకలు ఏ ఆపరేషనూ అవసరం లేకుండానే అతుక్కుంటాయి. కొన్ని ఎముకలకు ఆపరేషన్ అవసరమౌతుంది, ఉదాహరణకి:తుంటి ఎముక. కొన్ని ఎముకలు విరిగినపుడు వాటిని కదల కుండా ఉంచటానికి, రోగిని కొన్ని నెలలపాటు మంచంలో ఉంచవలసి వస్తుంది. కొన్ని రకాల ఎముకలు విరిగినపుడు ఆపరేషన్ ద్వారా బాగు చేస్తారు. దీనివల్ల రోగి త్వరగా ఊతకర్రల సహాయంతో నడవగలుగుతాడు. ఆపరేషన్ లో ఎముక లో విరిగిన భాగాన్ని లోహపు కడ్డీ లేక రేకు తో అతికిస్తారు. ఈ లోహం ప్రత్యేకంగా తయారు చేయబడుతుంది. ఈ రకం ఆపరేషన్ యొక్క సౌకర్యం కొన్ని పెద్ద ఆసుపత్రులలో మాత్రమే ఉంది."

ఈ వివరాలన్నీ తెలుసుకుని హరి చాలా సంతోషించాడు. ఇక తను గ్రామంలో అందరికీ ఈ విషయాలను చెప్పాలను కున్నాడు. దీంతో గ్రామంలోని పిల్లా పెద్దా ఎవ్వరూ వికలాంగులు కాకుండా చూసుకోవచ్చు అనుకున్నాడు.



Lasertypeset at PRINTOFAST, 11/4, Old Rajinder Nagar, New Delhi -110060
and printed at Tara Art Printers, Sector V, NOIDA.

ఈ పుస్తకం నవసాక్షరుల కోసం ప్రచురింపబడింది. మీరు నవసాక్షరులైతే ఈ దిగువ యివ్వబడిన ప్రశ్నాపత్రాన్ని తెల్ల కాగితం పై రాసి పూర్తిచేసి కింద యివ్వబడిన చిరునామాకి పంపండి. ఇది మాకు ఇంకా మంచి పుస్తకాలు ప్రచురించేదుకు సహాయపడుతుంది.

1. పూర్తి పేరు
2. వయస్సు
3. మాతృ భాష
4. వృత్తి
5. నెలసరి ఆదాయం
6. పూర్తి అడ్రసు
7. అక్షరాస్యతకి సంబంధించిన వయోజన వాచకాలలో ఎన్ని భాగాలు మీరు చదివారు?
8. చదవడం, రాయడం మీరు ఏకార్యాలలో ప్రయోగిస్తారు?
9. మీరు పేపరు చదువుతారా? — అప్పుడప్పుడు, తీరికవేళల్లో, ప్రతిరోజూ?
10. మీరు పుస్తకాలు చదువుతారా? — అప్పుడప్పుడు, తీరికవేళల్లో, ప్రతిరోజూ?
11. మీకు ఎటువంటి పుస్తకాలు చదవడానికి కావాలి?
12. ఈ పుస్తకంలోని విషయం మీకు నచ్చిందా?
13. మీరు ప్రతినెలలో పుస్తకాల కోసం ఎంత డబ్బు ఖర్చుపెట్టగలరు?

ఈ దిగువ చిరునామాకి పంపించండి :

సంపాదకీయ విభాగం

నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా

ఎ-5, గ్రీన్ పార్క్

న్యూఢిల్లీ - 110016